క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమనతో భేటీ



భూమన కరుణాకరరెడ్డిని సన్మానిస్తున్న సునీల్‌కుమార్

పూతలపట్టు: ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన భూమన కరుణాకరరెడ్డిని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం పద్మావతిపురంలోని ఆయన నివాసంలో కలిసి దుశ్శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో పార్టీ విషయాలు, ఇతర విషయాలపై చర్చించారు.

విజేతలకు ఎస్పీ బహుమతుల ప్రదానం



విజేతలతో ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ఎస్పీ మణికంఠ బహుమతులు అందచేశారు. బుధవారం చిత్తూరులోని పోలీసు అతిథి గృహంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన వారికి రూ. 5వేలు, రూ.3 వేలు, రూ.2 వేల చొప్పున నగదు బహుమతులు అందచేశారు. 'సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర, ప్రస్తుత పరిస్థితుల్లో పోలీసులకు సవాళ్లు' అనే అంశాలపై విద్యార్థులకు, పోలీసులకు పోటీలు నిర్వహించడం విదితమే.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



గ్రామసభలో అర్జీలు ఇస్తున్న రైతులు

గుడిపాల: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామసభలు నిర్వహిస్తున్నామని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. బుధవారం పశుమంద రెవెన్యూలో స్థానిక సర్పంచ్ రజనీకాంత్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, భూవిస్తీర్ణ సమస్య, ఉమ్మడి ఎల్ఫీ ఖాతా, గట్లలో తేడాలు ఇత్యాది సమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వాలన్నారు. రైతులు ఇచ్చిన అర్జీలను 45రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. సభలో 28 మంది రైతులు సమస్యలపై అర్జీలు ఇచ్చారు.

నర్సరీలపై విద్యార్థులకు అవగాహన

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అగ్రికల్చర్ ఒకేషనల్ విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా నర్సరీలపై అవగాహన కల్పించేందుకు బుధవారం టీఎస్ అగ్రహారంలోని పలు నర్సరీలకు తీసుకెళ్లారు. నర్సరీలలో పెంచిన నారు నాటడంతో పంట నాణ్యంగా పెరిగి, మంచి దిగుబడులనిస్తుందని టీచర్లు వారికి వివరించారు. కార్యక్రమంలో అభిలాష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

టపాసుల ధర ధాం..ధాం..!

టపాసుల ధరలు పేలుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే అన్ని ధరలు 20 నుంచి 30 శాతం వరకు పెరిగాయి. 1000 రూపాయలు తీసుకెళితే చిన్న క్యారీ బ్యాగ్ కూడా నిండడం లేదు. అగ్గిపెట్టె నుంచి థౌజండ్ వాలా వరకు ధరలు పేలుతున్నాయి. దీంతో పొరుగునే ఉన్న తమిళనాడులో తక్కువ ధర ఉండటంతో అక్కడికి వెళ్లి కొందరు వినియోగదారులు కొంటున్నారు. దీనికితోడు ఆన్‌లైన్‌లో టపాసుల కొనుగోళ్ల వైపు వినియోగదారులు మొగ్గు చూపారు. మూలిగే నక్కమీద తాటిపండు పడినట్లు..గురువారం ఉన్నపళాన వరుణుడి రాకతో టపాసుల దుకాణాల వ్యాపారం తుస్సుమంది.



మురకంబట్టు ప్రాంతంలో ఏర్పాట్లు చేసిన షాపుల వద్ద నిలిచిన వర్షపు నీరు

- మురకంబట్టులో 28 బాణసంచా షాపులు ఏర్పాటు
- వరుణుడి దెబ్బకు వ్యాపారం తుస్స్
- డీలా పడిన వ్యాపారులు
- ఆన్‌లైన్‌లో కొనుగోళ్లపై వినియోగదారుల ఆసక్తి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని మురకంబట్టు ప్రాంతంలో టపాసుల విక్రయ కేంద్రం ఏర్పాటైంది. తొలుత పీవీకేఎస్ మైదానంలో పెట్టాలని అనుకున్నప్పటికీ తర్జనభర్జన పడి మురకంబట్టుకు తరలించారు. అక్కడ 28 షాపులకు అధికారికంగా అనుమతులొచ్చాయి. వ్యాపారులు కూడా భారీ స్థాయిలో వ్యాపారం జరుగుతుందని ఆశించారు. అయితే మురకంబట్టు దూరం కావడం, మరోవైపు బుధవారం సాయంత్రానికి పొగమంచు ఆవరించి వర్షం కురిసింది. దీంతో మైదానంలో అక్కడక్కడా నీళ్లు నిలిచాయి. ఇక, వర్షానికి టపాసులు తడవకుండా ఉండేందుకు దుకాణదారులు టార్పాలిన్ పట్టలు కప్పి అవస్థలు పడ్డారు. వచ్చే కొంతమంది వినియోగదారులు కూడా నీళ్లు నిలిచిన ప్రాంతంలోని దుకాణాల వైపు కన్నెత్తి చూడలేదు. మొదట్లో ఉన్న షాపుల్లోనే టపాసులు కొనుగోలు చేసి వెళ్లిపోతున్నారు. పైగా టపాసుల మోత మోగుతుండడం కూడా కొనుగోళ్లపై ప్రతికూల ప్రభావం చూపింది. కాకరొత్తుల సాదా బాక్స్ ధర మంచి కంపెనీ అయితే రూ. 120 నుంచి రూ. 150 వరకు ఉంది. గతేడాది రూ. 60 నుంచి రూ. 70వరకు ఉండేది. చిచ్చుబుడ్లు చిన్నవి పది ఉండే చిన్న బాక్స్ రూ. 80 నుంచి రూ. 100 ఉంది. అదే పెద్దవి అయితే మంచి కంపెనీ రూ. 350 వరకు పలుకుతోంది. తాళ్లు (జాటీలు) చిన్న పెట్టె రూ. 50, పెద్దవి రూ. 100, సీమ టపాసులు చిన్న బాక్స్ రూ. 60 పలుకుతోంది. భూ చక్రాలు రూ. 120 నుంచి రూ. 150 దాకా ఉంది. 5000వాలా రూ.1,200 నుంచి రూ. 1500 వరకు ఉంటోంది.

శివకాశి టు చిత్తూరు

ఈసారి ఆన్‌లైన్‌లో టపాసుల వ్యాపారం జోరందుకుంది. ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో తమిళనాడు శివకాశి టపాసుల బుకింగ్ పుంజుకుంది. 60 శాతం మంది చిత్తూరు వాసులు ఆన్‌లైన్‌లో తెలుస్తోంది. ఇక్కడ ధరల మోత ఉంటుందని భావించి ముందుగానే కావాల్సిన మేర ఆర్డర్లు పెట్టుకున్నారు. మరో 20 శాతం మంది తక్కువ ధరకు లభించే తమిళనాడులోని వేలూరు, పరదరామి, పళ్లిపట్టు, వెళ్లిమలై వంటి ప్రాంతాల్లో టపాసులు కొనుగోలు చేశారు. ఈ కారణంగా చిత్తూరు టపాసుల విక్రయ కేంద్రంలో కొనుగోలుదారులు తక్కువగా కనిపించారు. గురు, శుక్రవారమైనా వ్యాపారం పుంజుకుంటుందనే ఆశాభావంతో వ్యాపారులు ఉన్నారు. అయితే మళ్లీ వర్షం వస్తే మాత్రం ఇక వ్యాపారం తుస్స్‌స్స్..అని నిట్టూరుస్తున్నారు.

సీఎన్‌ఆర్ కళాశాలలో ఐక్యతా దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గుడిపాల: స్థానిక సీఎన్ఆర్ కళాశాలలో బుధవారం జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్ మాట్లాడుతూ, స్వతంత్ర భారతావని తొలి ఉప ప్రధాని, ఉక్కుమనిషిగా పేరు పొందిన సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని ఏటా అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దేశ సమగ్రత కోసం కీలకపాత్ర పోషించిన వ్యక్తి ఆయన అని కీర్తించారు. భారతీయులంతా ఒక్కటిగా ఉండాలని ఏ ప్రాంతమైనా, రాష్ట్రమైనా అందరూ ఎలాంటి విభేదాలు లేకుండా కలిసిమెలిసి ఉండాలన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ర్యాలీగా వెళ్లి ప్రతిజ్ఞ చేశారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

గుడిపాల: పర్యావరణ పరిరక్షణే తమ ధ్యేయమని బొమ్మసముద్రం కళాశాల ప్రిన్సిపాల్ శరత్ చంద్రశేఖర్ అన్నారు. స్వచ్ఛతా హి సేవ, నవంబర్ 3న కేఎం రెడ్డి వర్ధంతి పురస్కరించుకుని ఆయన స్ఫూర్తితో బుధవారం కళాశాల ఆవరణలో 50 మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ, కేఎంరెడ్డి సేవలు శ్లాఘనీయమని ప్రస్తుతించారు. కార్యక్రమంలో కేఎం రెడ్డి అసోసియేషన్ సభ్యులు సుబ్రమణ్యంరెడ్డి, అధ్యాపకులు రెడ్డెప్పరెడ్డి, జ్యోతి, కల్పన, ఓబులేసు, తిరుమల సెల్వి, బత్తయ్య, ప్రసన్నకుమారి, హేం అమర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వెలుగులు పంచే దీపావళి



పూతలపట్టులో టపాసులను కొనుగోలు చేస్తున్న యువకులు

పూతలపట్టు: మండలవ్యాప్తంగా గ్రామాల్లో బుధవారం దీపావళి శోభ సంతరించుకుంది. మండల కేంద్రంలో భారీగా బాణసంచా విక్రయాలు కొనసాగాయి. మాములుగా ఇక్కడ 3 టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసేవారు. ఈసారి వావిల్‌తోటలో ఒక దుకాణానికే అధికారులు అనుమతులిచ్చారు. అయితే యం.బండపల్లి సమీపంలో రెండు దుకాణాలు ఏర్పాటు చేసి టపాసులు విక్రయిస్తున్నారు. చిన్నారులు అధిక సంఖ్యలో బాణసంచాలు కొనుగోలు చేశారు. యాదమరి మండలంలో అధికారులు నాలుగు దుకాణాలకు అనుమతులు అందజేశారు.

అంతటా సందడి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో బుధవారం దీపావళి సందడి నెలకొంది. కొనుగోలు, అమ్మకాలతో చర్చివీధి, బజారువీధి జనంతో కిటకిటలాడాయి. పూజకు కావాల్సిన అరటి ఆకులు, చెరుకు గడ్డలు, పూలు, ప్రమిదలు ఇతరత్రా వస్తువుల కొనుగోలులో ప్రజలు బిజీబిజీగా కనిపించారు. వస్త్ర దుకాణాలు సైతం కిక్కిరిశాయి. మురకంబట్టులోని టపాసులు విక్రయ దుకాణాల్లో జనంతో సందడిగా కినిపించాయి.

అప్రమత్తత పాటించండి



టపాసుల వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: చిన్నాపెద్దా అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ దీపావళి. అయితే బాణసంచా కాల్చేటప్పుడు మాత్రం తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సీఐ శ్రీనివాసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పంటపొలాలు, గడ్డివాములు, పూరిగుడిసెలు అధికంగా ఉంటాయని, అలాంటి ప్రాంతాల్లో చిచ్చుబుడ్లు, తారాజువ్వలు వంటివి కాల్చరాదని, పండుగ ఆనందంలో పిల్లల పట్ల ఏమాత్రం అజాగ్రత్త వహించినా జీవిత కాలం ఇబ్బంది పడాల్సి వస్తుందని హెచ్చరించారు. పిల్లలు టపాకాయలు కాల్చేటప్పుడు పెద్దలు ఓ కన్ను వేసి ఉంచాలన్నారు. ఇక, టపాసుల విక్రేతలు తమ దుకాణాల వద్ద విధిగా ఇసుక, నీరు, కార్బన్ డయాక్సైడ్ వాయువును అందుబాటులో ఉంచుకోవాలని, దుకాణాల మధ్య కనీసం పది అడుగులు దూరం ఉండేలా చూడాలని, ప్రతి దుకాణం ఎదుట టపాకాయల ధరల పట్టిక, అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నంబర్లు తప్పకుండా ఉండాలన్నారు.

మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం

తవణంపల్లె: ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(ఏపీ యూటీఎఫ్) తవణంపల్లె మండల శాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండలంలోని ఐరాల క్రాస్‌లో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మండల యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడిగా ఎం. మునస్వామి, మండల అధ్యక్షుడిగా ఎస్. రాజేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శేఖరయ్య, మమత, ప్రధాన కార్యదర్శిగా పెద్దబ్బరెడ్డి, కోశాధికారిగా చిరంజీవి, కార్యదర్శులుగా నిరంజన్ రెడ్డి, అరుణాచలం, గీత, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వెంకటరమణ, జిల్లా కౌన్సిలర్లుగా రాజేష్‌కుమార్, పెద్దబ్బరెడ్డి, సురేష్‌బాబు, శైలజ, జిల్లా నాయకులు సుధాకర్ రెడ్డి, రెహానాబేగం, గణేష్, పార్థసారథి, సరిత, సీఐటీయూ నాయకులు గంగరాజు, సురేంద్ర, అంగన్‌వాడీ నాయకులు జమున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలి

తవణంపల్లె: పశుపోషణలో పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్థక శాఖ డీడీ డాక్టర్ ఆరిఫ్ అన్నారు. బుధవారం మండలంలోని దిగువ మత్యం, ఎగువ మత్యం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు పచ్చిగడ్డితో పాటు ఎండుగడ్డి వేయాలని సూచించారు. మినరల్ మిక్చర్ వాడడం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి పంటలు సాగు చేయాలన్నారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని, తద్వారా అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో మండల వెటర్నరీ అధికారి డాక్టర్ లావణ్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యం



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ రక్షిత

గుడిపాల: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రక్షిత అన్నారు. బుధవారం చింతగుంటూరులో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు, బీపీ, షుగర్ ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే వైద్య సేవలను అందించారు. సిబ్బంది యమున, వనజ, కలైవాణి, కోకిల, సుజాతమ్మ పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

తవణంపల్లె: వృద్ధాప్యంలో ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని ఎగువ మారేడుపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది రోగులకు వైద్య సేవలందించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గర్భిణులు 108, 104 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ధనలక్ష్మి

ఐరాల: పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేసేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఎంపీడీఓ ధనలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని కామినాయనపల్లెలో పక్కాగృహాల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడిని కలిసి నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. పనులు పూర్తి కాగానే సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు దీపావళి



న్యూయార్క్ పాఠశాలలో వివిధ వేషధారణలతో విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని న్యూయార్క్, విజయం, లిటిల్ రోస్ విద్యాసంస్థల్లో ముందస్తు దీపావళి సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్నారు. న్యూయార్క్ పాఠశాల చైర్మన్ శ్రీధర్, విజయం కళాశాల చైర్మన్ తేజోమూర్తి, లిటిల్ రోస్ కరస్పాండెంట్ గోపాలకృష్ణమూర్తి మాట్లాడారు. విద్యార్థుల పండుగల గొప్పదనాన్ని తెలుసుకుని సంస్కృతీ సాంప్రదాయాలను పాటించాలని కోరారు. పర్యావరణాన్ని రక్షించే దిశగా దీపావళి సంబరాలు జరుపుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలజ, లిటిల్ రోస్ డైరెక్టర్లు రాధిక, లోహిత్, పవిత్ర పాల్గొన్నారు.



లిటిల్ రోస్ పాఠశాలలో..



విజయం పాఠశాలలో..